

లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. -8లో..



బంగారు భవితకు బాటలు వేసుకోవాలి

విద్యార్థులు బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. -8లో..



శ్రీనివాసరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు

వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డి గారి శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. -8లో..

న్యూస్‌రీల్

రేకులకుంట వీఆర్వో సస్పెన్షన్

కడప సెవెన్‌రోడ్స్/బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన గ్రేడ్-1 వీఆర్వో కోలా నరసింహులును సస్పెండ్ చేసినట్లు బద్వేలు ఆర్డీఓ వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. చట్టబద్ధమైన విధులను నిర్వర్తించేటపుడు తప్పుగా ప్రవర్తించినట్లు ఫొటోలు, వీడియో రికార్డింగ్ ద్వారా వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ కావడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (సీసీ అండ్ ఏ) రూల్స్-1991, రూల్-8లోని సబ్‌రూల్ (1)మేరకు ఆయనను సస్పెండ్ చేశామన్నారు. దీనిపై 24 గంటల్లోపు వీఆర్వో కోలా నరసింహులు వివరణ ఇవ్వాలన్నారు.

గండి నిత్యాన్నదానానికి ఎంపీ మిథున్‌రెడ్డి విరాళం

చక్రాయపేట: గండి పుణ్యక్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి రూ.5లక్షలు విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.గత ఏడాది అక్టోబర్ నెలలో మిథున్‌రెడ్డి గండికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని చెప్పారు. ఆ సమయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షలు విరాళంగా ఇస్తానని ప్రకటించారని, ఈమేరకు ఆయన శనివారం సదరు మొత్తాన్ని బ్యాంకు ఆలయ ఖాతాకు జమచేసి సమాచారాన్ని తమకు అదజేశారని తెలిపారు.ఈసందర్భంగా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలకు దరఖాస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : మసీదు పేష్‌మామ్, మౌజన్ల గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్లకు రూ. 5 వేలు చొప్పున జిల్లాలో 355 మసీదులకు ప్రతినెల చెల్లిస్తున్నామన్నారు. గౌరవ వేతనాలు లభించని 117 మసీదుల అధ్యక్ష, కార్యదర్శుల నుంచి జిల్లా వక్ఫ్‌బోర్డు దరఖాస్తులు తీసుకుని విజయవాడ కార్యాలయానికి పంపారన్నారు. ఇప్పటికే గౌరవ వేతనాలు పొందుతున్న మసీదులు, దరఖాస్తులు ఇచ్చిన మసీదులు కాకుండా ఆదాయం లేని మసీదుల అధ్యక్ష, కార్యదర్శులు ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ ద్వారా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్, కొత్త కలెక్టరేట్, సి-బ్లాక్, వైఎస్సార్ జిల్లా అనే చిరునామాకు పంపాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 9573073786 నంబరులో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ గౌస్‌బాషాను సంప్రదించాలని సూచించారు.

జెడ్పీలో ఏడుగురికి ఏఓలుగా పదోన్నతులు



జెడ్పీ సీఈఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ మినిస్ట్రీరియల్ ఉద్యోగ సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ పరిధిలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఏడుగురికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించి శనివారం వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. జమ్మలమడుగులో పనిచేస్తున్న టి.గురుస్వామిని తొండూరుకు, పులివెందులలో పనిచేస్తున్న జి.సుధాకర్‌ను చక్రాయపేటకు, బద్వేలులో పనిచేస్తున్న కృష్ణశర్మను కాశినాయనకు, బి.మఠంలో పనిచేస్తున్నమల్లికార్జునను అదేచోట ఏఓగా నియమించారు. చెన్నూరులో పనిచేస్తున్న అజీముల్లాను ఖాజీపేటకు, బి.కోడూరులో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌ను సింహాద్రిపురంకు, కడప జెడ్పీపీలో పనిచేస్తున్న పీవీ భాస్కర్‌రెడ్డిని వల్లూరు ఏఓగా నియమించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, ఎస్.బసిరెడ్డిలు జెడ్పీ చైర్ పర్సన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ ఎంవీ రంగాచార్యులు, ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగిరెడ్డిలకు పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు.

బడి.. సాంకేతిక ఒరవడి

- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్(ఐఎఫ్‌పీ) ద్వారా అంతర్జాతీయస్థాయి బోధనలు
- తొలిదశలో 182 యూపీ, హైస్కూళ్లకు 1109 ఐఎఫ్‌పీలు మంజూరు
- త్వరలో అన్ని పాఠశాలల్లో ఏర్పాటుకు చర్యలు





ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌పై పెన్‌తో రాస్తున్న నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

జిల్లాలో పాఠశాల వివరాలు...

కేటగిరి	పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం
ప్రాథమిక	1642	33159	33838	66997
ప్రాథమికోన్నత	142	7393	8041	15434
ఉన్నత	310	35083	40642	75725
మొత్తం	2094	75635	82521	1,58,156

కడప ఎడ్యుకేషన్: ఇప్పటివరకు టాబ్స్, ఈ -పాఠశాల, చాట్‌బోర్డు వంటి వివిధ రూపాల్లో బోధనలు అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన పిల్లలు పోటీ పడేలా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు శ్రీమంతుల పిల్లలకే పరిమితమైన డిజిటల్ విద్య నేడు పేద విద్యార్థులకు సైతం అందుబాటులోకి రానుంది. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. డిజిటల్ విప్లవం ద్వారా కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు అందుకునే అవకాశం ఏర్పడనుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలోని 182 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,109 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి దృశ్య వీక్షణ ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 358 ప్రాథమిక పాఠశాలలకు 530 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. ఇనాళ్లు కేవలం ఉపాధ్యాయుడు చెప్పింది శ్రద్ధగా విన్న తర్వాత అభ్యసనపైన విద్యార్థులు దృష్టి సారిస్తూ వస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో జాతీయస్థాయిలో రాణించాలంటే అధునిక సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి.దీనిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేసి తరగతి గదిలో సాంకేతిక విప్లవం తీసుకురానున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లితండ్రుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తొలిదశలో ఐఎఫ్‌పీకు మంజూరైన పాఠశాలలు	182
మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు	1109
ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన పాఠశాలలు	110
ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్	660
స్మార్ట్ టీవీలు మంజూరైన పాఠశాలలు	358
ప్రాథమిక పాఠశాలకు మంజూరైన స్మార్ట్ టీవీలు	530

ఈ ఏడాది నుంచే...



దొరసానిపల్లె హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్

జిల్లాలో తొలిదశలో 358 పాఠశాలల్లో సాంకేతికత అందుబాటులోకి తెస్తున్నారు. బైజ్యూస్ సేవలను వినియోగించుకుంటూ ప్రారంభమయ్యే శిక్షణ కోసం 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల సౌకర్యార్థం స్మార్ట్ టీవీలు అమర్చుతారు. 6 నుంచి పదో తరగతి వరకు ఉండే పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా జిల్లాకు 182 పాఠశాలల్లో 1109 ఐఎఫ్‌పీలను అమర్చనున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 110 స్కూళ్లలో 660 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెళ్లను ఏర్పాటు చేశారు. త్వరలో అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసి బోధనలను ప్రారంభించనున్నారు. అలాగే 358 ప్రాథమిక పాఠశాలలకు 530 స్మార్ట్ టీవీలను మంజూరు చేశారు. వీటిని కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

ఐఎఫ్‌పీతో ఉపయోగాలు...

- దృశ్య శ్రవణ, ఇంటకార్టివ్‌తో కూడిన 2డీ, 3డీ యానిమేటర్ కంటెంట్‌ను బోధించడం,
- విద్యార్థికి సులభంగా అవగాహన, కఠినమైన భావనలను సరళీకృతం చేసి అందించే విధంగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు గుండె గురించి విద్యార్థులకు బోధించే సమయంలో నేరుగా గుండె పనిచేసే విధానం, వీడియో, ఆడియో, 3డీ రూపంలో అర్థమయ్యే విధంగా బోధించడానికి ఇంటర్‌నెట్ సహకరం ద్వారా విజువల్స్‌తో ఈ పరికరం చూపిస్తుంది.
- ప్రపంచ స్థాయిలో పోటీ పడే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి సులభంగా కఠినమైన అంశాలు అభ్యసించడానికి సహాయపడుతుంది
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించే విధంగా నాణ్యమైన విద్యను అందించడానికి బైజ్యూస్‌తో పాటు ఎస్‌సీఈఆర్టీ వారు మంచి పాఠ్యాంశాలను రూపొందించి అందించేందుకు కృషి చేస్తున్నారు.

నాణ్యమైన విద్యాబోధనకు శ్రీకారం



ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం ద్వారా స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యాబోధనకు శ్రీకారం చుట్టింది. ఈ గొప్ప అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. భవిషత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి.

రెండోదశ రీ సర్వే పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ విజయరామరాజు



వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా చేపట్టిన రెండో దశ రీ సర్వే పనులు గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం ఇవే అంశాలపై చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న భూ హక్కు, భూ రక్ష కింద ఇప్పటిదాకా జరిగిన పనులను, ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. రెండో దశలో 89 గ్రామాలకుగాను 64 గ్రామాల్లో రీ సర్వే, 32 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేశామన్నారు. మిగతా గ్రామాల్లో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకాలు సిద్ధం చేయాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాల పరిపూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జాప్యం లేకుండా సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యలను నాణ్యవంతంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావు, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మురళీకృష్ణ, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ బాలాంజనేయులు, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాంగం కదిలింది

జగనన్న సురక్షతో ఇంటింటికీ వలంటీర్లు: సమస్యల నమోదు



బద్వేలు మండలం పుట్టాయపల్లెలో సమస్యలను తెలుసుకుంటున్న వలంటీర్లు

కడప సెవెన్‌రోడ్స్: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చాలని 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం జిల్లాలో ప్రారంభించారు. జిల్లాలో 645 సచివాలయాలు ఉండగా, తొలి విడతగా 50 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహించారు. జిల్లాలో 893 మంది వలంటీర్లకుగాను 633 మంది తొలిరోజు సర్వేలో పాల్గొన్నారు. వలంటీర్లు 70.88 శాతం సర్వే పూర్తి చేశారు. జిల్లాలో 52,427 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. కాగా, 8977 కుటుంబాల సర్వే చేపట్టారు. తొలిరోజు సాయంత్రానికి 17.11 శాతం కుటుంబాల సర్వే పూర్తి చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, జగనన్న అభిమానులు, ప్రజాప్రతినిధులు ఆయా సచివాలయాల పరిధిలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు.ఇంకా లబ్ధి పొందని వారి వివరాలను వలంటీర్లు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. జులై 1 నుంచి నిర్వహించనున్న క్యాంపుల గురించి వివరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా అప్‌లోడ్ చేయిస్తామని తెలియజేశారు. సచివాలయ పరిధిలో ఎప్పుడు క్యాంపులుఏర్పాటు చేస్తారన్న విషయాన్ని ప్రజలకు ముందుగా తెలియజేస్తామని చెప్పారు. ఆరోజున క్యాంపు వద్దకు వస్తే 11 రకాల డాక్యుమెంట్లలో అవసరమైన వాటిని ప్రజలకు అందజేస్తామని తెలిపారు.

జిల్లాకు చేరిన 834 టన్నుల ఎరువులు

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలోఎరువుల కొరత ఉండదని జిలా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం జిల్లాకు 834 టన్నుల ఎరువులు చేరాయన్నారు. రైలు రేక్ ద్వారా వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. 415 టన్నుల డీఏపీ, 419 టన్నుల యూరియా వచ్చిందన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం వచ్చిన ఎరువుల్లో 355 టన్నుల డీఏపీ, 299 టన్నుల యూరియాను రైతు భరోసా కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. ఆది, సోమవారాల్లో కూడా మరో రెండు రేక్‌ల ఎరువులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ డీవీ సుబ్బారావు, ఏవో సురేష్ బాబారెడ్డి, జేడీ కార్యాలయ ఏవో సుమంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాల ఎంపికలకు స్పందన



800 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడాపాఠశాలలో 4వ, 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. తొలిరోజు శుక్రవారం 25 మంది హాజరుకాగా, రెండోరోజు శనివారం 54 మంది విద్యార్థులు హాజరుకావడం విశేషం. మొత్తం మీద 4వ తరగతికి 43 మంది, 5వ తరగతికి 36 మంది చొప్పున మొత్తం 79 మంది హాజరయ్యారు. ఈ ఎంపికలను స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 29, 30 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపికలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ఎత్తు, బరువు, మెడిసినల్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెంలో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో శిక్షకులు అనిల్, వెంకటేశ్వరరావు, రాజేంద్ర, సుదర్శన్, అక్బర్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్.చిత్రంలో పోలీసు అధికారులు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కడప నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్రమైన నేరాల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని, నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. దేశీ అక్రమమద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలన్నారు. ఎస్‌హెచ్‌ఆర్సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలనీ పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి


గంగిరెడ్డి (ఫైల్)

వేముల : మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి గంగిరెడ్డి(45) అనే వ్యక్తి శనివారం జీఎన్‌ఎస్‌ఎస్ కాలువలో పడి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓబుళరెడ్డి గంగిరెడ్డి తోట వద్దకు మరో వ్యక్తితో కలిసి బైకుపై వెళ్లారు. జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ వెంట వెళుతుండగా.. మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో వెనుక కూర్చొన్న ఓబుళరెడ్డి గంగిరెడ్డి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువలో పడ్డాడు. దీంతో ఓబుళరెడ్డి గంగిరెడ్డి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి నారేపల్లె గ్రామానికి వెళ్లి ఓబుళరెడ్డి గంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

నీటి సంపులో పడిన జింక

– రక్షించిన అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజలు



కడప అర్బన్ : కడప నగర శివారులోని మామిళ్లపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో ఓ ఇంటి సంపులో ప్రమాదవశాత్తు ఓ మచ్చల జింక పడింది. ఈ సంఘటనపై స్థానికులు అటవీశాఖ వారికి సమాచారం ఇచ్చారు. శనివారం ఎఫ్ఆర్‌ఓ ప్రసాద్, డీఆర్‌ఓ ఓబులేసు, ఎఫ్‌బీఓ రఘువీర్, ఇతర సిబ్బంది తోపాటు స్థానిక ప్రజలు జింకను సంపులో నుంచి బయటకు సురక్షితంగా తీసి, తరువాత దగ్గరిలోని అటవీ ప్రాంతంలోకి వదిలిపెట్టారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కడప అర్బన్ : పర్మినెంట్ లోక్ అదాలత్ (పీఎల్‌ఏ) ద్వారా ఫిర్యాదుదారులకు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందివ్వడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. శనివారం ప్రజా ప్రయోజిత, న్యాయసేవలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ, శాశ్వత లోక్ అదాలత్‌ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణప్రసాద్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జి సెక్రటరీ ఎం. ప్రదీప్‌కుమార్‌లు విచ్చేశారు. ఈ అవగాహనకు హాజరైన జిల్లా అధికారులకు పర్మినెంట్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ 'పర్మినెంట్ లోక్ అదాలత్' అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం (ఏ ఇతర కోర్టులో పెండింగ్ లేని) కలిగి వున్న వారందరికీ ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారన్నారు. కడపలో జిల్లా కోర్టు ఆవరణలో వున్న ఈ వ్యవస్థ, రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టానికి లోబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుతో ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజాప్రయోజిత సేవా రంగాలకు సంబంధించి త్వరితగతిన న్యాయపరిష్కారం పొందవచ్చన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మినెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని, లేదా సెల్ నంబర్లు : 86396 84279, 99637 31698లకు కాల్ చేసి చట్టంపై సరైన అవగాహన పొందవచ్చని తెలియజేశారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రయోజిత సేవల్లో లోపం, పరిహార కోసం దావా, సొమ్ము వసూలు, పర్మినెంట్ లోక్ అదాలత్ నినాదమన్నారు. ప్రజా ప్రయోజిత సేవలలో లోపాలతో కలుగు నష్టాలపై వచ్చే ఫిర్యాదులకు, సంబంధిత ప్రజా ప్రయోజిత శాఖల అధికారులు ఎలా స్పందించాలి, జాతీయ లోక్ అదాలత్‌కు, పర్మినెంట్ లోక్ అదాలత్‌లకు వ్యత్యాసం తదితర అనే అంశాలపై సంబంధిత జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ప్రజా ప్రయోజిత సేవారంగాలకు చెందిన సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం, ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయంతోనే సుస్థిర ఆదాయంతోపాటు ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. శనివారం కడపలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పురోగతిపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతుకు అవగాహన పెంచి సాగును ప్రోత్సహించాలన్నారు. పురుగు ముందులు లేని ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం కూడా లభిస్తుందని తెలియ చెప్పాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతుల కోసం ఎస్‌టుఎస్, పీఎండీఎస్ కిట్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు మాట్లాడుతూ ప్రతి రైతు పంట పొలంలో అంతర్ పంటలు, సరిహద్దు పంటలు సాగు చేసుకునునేలా చూడాలన్నారు. తద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులను గుర్తించి వారికి ఎస్‌టుఎస్(విత్తన కిట్లు) ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందేలాగా చూడాలన్నారు. పీఎండీఎస్ విస్తీర్ణ పురోగతి పెంచే లాగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. రైతు శిక్షణ కేంద్ర ఏడీఏ రమణారెడ్డి జీవ శిలీంద్రాలు, వాడే పద్ధతుల గురించి వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సంఘాల నిధుల స్వాహాపై విచారణ

వల్లూరు : మండల పరిధిలోని గ్రామ సంఘాల నిధుల స్వాహా విషయంపై 'వైఎస్ఆర్ క్రాంతి పథంలో గ్రామ సంఘాల నిధుల స్వాహా' పేరుతో శనివారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు ఆ శాఖ అన్నతాధికారులు స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ శనివారం దీనిపై స్పందిస్తూ నిధుల స్వాహా విషయంపై కమలాపురం, ప్రొద్దుటూరు, పులివెందుల క్లస్టర్‌లకు చెందిన లీగల్ కంప్లెక్స్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు డి.సుజాత, శ్రీనివాసులు, వి నాగార్జునలను విచారణకు నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వీరు గ్రామ సమాఖ్యల ఖాతాలను పరిశీలించి, గ్రామ సంఘాల వారీగా దుర్వినియోగం అయిన నిధుల వివరాల తుది నివేదికను అందిచాలని ఆదేశించామని తెలిపారు. వీరి ఆధ్వర్యంలో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. వారు విచారణ నివేదికను సమర్పించిన తరువాత తుది నివేదికతోపాటు, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సిబ్బందిపై తీసుకొను శాఖాపరమైన చర్యల గురించి తెలియజేస్తామని వివరించారు.

మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు

వీరపునాయునిపల్లె : దేశాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడుకొందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. శనివారం వీరపునాయునిపల్లెలోని సంగమేశ్వరాయం వద్ద జరిగిన జిల్లా స్థాయి శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమైక్యత, సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలకు ప్రతి ఒక్కరూ సమాయత్తం కావాలని తెలిపారు. కేంద్రంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలకు తిలోదకాలిచ్చి నిరంకుశ పాసిస్టు చర్యలను ముమ్మరం చేసిందన్నారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకొన్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరుస్తూ చట్టాలు చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు కేటాయించడం, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం వహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోసి తమ ప్రభుత్వాలను నెలకొల్పుతూ ప్రజాస్వామ్యాన్ని నిట్ట నిలువునా ఖూనీ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, సుబ్బరాయుడు, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవితకు బాటలు వేసుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : విద్యార్థులు బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. పోలీసు కుటుంబాలకు చెంది టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులకు జిల్లా ఎస్పీ స్థానిక 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ప్రోత్సాహకంగా స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలను అందజేసి వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో ముచ్చటించారు. వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారి అవుతామని, టీచర్, నర్సింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, డాక్టర్ అవుతామని వారు చెప్పారు. పోలీసు కుటుంబాల పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారని, పలువురు ఇతర రంగాల్లో రాణించారని ఎస్పీ తెలిపారు. ఆసక్తి వున్న ఏ రంగంలోనైనా, వృత్తిలో నైనా నంబర్‌వన్‌గా పని చేయాలన్నారు. కుటుంబాలను బాగా చూసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ఆరోగ్యం కాపాడుకుంటూ భవిష్యత్తుపై ఆలోచన వుండాలన్నారు. మీ లక్ష్యాలను చేరుకునేందుకు బాగా చదవాలనీ, మీ తల్లిదండ్రులతోపాటు పోలీసుశాఖ అండగా వుంటుందనీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉప్పుశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు ప్రశంసా పత్రాలు

కడప అర్బన్ : పోలీసు శాఖలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. శనివారం స్థానిక 'పెన్నార్' కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఇటీవలి కాలంలో ఉత్తమ పనితీరు కనబరిచిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కడపలో ఏఎస్ఐ బి.రమణారెడ్డి, డీఎస్‌బి కానిస్టేబుల్ ఏ.బాలకృష్ణారెడ్డి (పి.సి. 1321)లను ఎస్పీ అభినందించారు.

- బాల్య వివాహాలు అరికట్టడంలో, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో విధుల్లో అత్యుత్తమ పనితీరు కనపరిచిన 30 మంది మహిళా పోలీసులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.
- జిల్లాలో ఇటీవలి కాలంలో వివిధ కేసుల్లో అత్యుత్తమ సేవలందించిన కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బందిలో 8 మందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. వీరితో పాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వున్నారు.
- ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌లోని రాజుపాళెం పరిధిలో రెండేళ్ల క్రితం రోకలిబండతో తలపై మోది హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ. 5 లక్షల జరిమానాను కోర్టులో విధించారు. ఈ కేసులో నేర నిరూపణ, దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన నలుగురికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ, నాన్నల ఆశయాన్ని నెరవేర్చా

- దేవుని ఆశీస్సులతో సివిల్స్‌లో ర్యాంకు సాధించా
- సివిల్స్‌లో 22వ ర్యాంకు సాధించిన పవన్‌దత్త


మాట్లాడుతున్న సివిల్‌టాప్ ర్యాంకర్ పవన్‌దత్త

కడప ఎడ్యుకేషన్ : తనకు డాక్టర్ కావాలని ఇష్టమున్నా, కలెక్టర్ కావాలన్న తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చానని, ఇందుకు ఎంతో సంతోషంగా, తృప్తిగా ఉందని ఇటీవల సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించిన పవన్‌దత్తా అన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన డాక్టర్ పవన్ దత్తాకు శనివారం కడపలోని ఐఎంఏ హాలులో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయనతోపాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. పవనదత్తాను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్‌దత్తా మాట్లాడుతూ తనకు డాక్టర్ కావాలనే ఇష్టంతో ఎంబీబీఎస్‌ను పూర్తి చేశానని, అలాగే తల్లిదండ్రుల ఆశయం మేరకు సివిల్స్‌లో ర్యాంకు సాధించి వారి కోరిక మేరకు పేద ప్రజలకు, సమాజానికి, దేశానికి సేవలందిస్తానన్నారు. విజయవాడ సీబీడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ ఉన్నతస్థాయి ఉద్యోగాల ద్వారానే పేద ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో రాణించాలంటే పట్టుదల, కృషి ఎంతో అవసరం అన్నారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరిగి యువత కష్టపడి అనుకున్న ఆశయాలను నెరవేర్చుకోవాలన్నారు. అనంతరం సివిల్ టాప్ ర్యాంకర్ పవన్‌దత్త తోపాటు ఆయన తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెయ్యినూతలకోన ఆలయ ధర్మకర్త పిన్నిపాటి నరసింహాహరిప్రసాద్, వేదిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వరదరాజన్‌తోపాటు పలువురు ప్రముఖులు డాక్టర్ గోపీనాథ్, వెంకటపతిరాయల్, ఉదయభాస్కర్‌రాజు, శ్రీధర్‌రావు, నాగరాజురావు, చంద్రమౌళిశర్మ, విజయభట్టర్, తిరుమల పీఆర్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం


మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా కేంద్రమైన కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా అసెంబ్లీ నియోజక వర్గాల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 2024లో తమ అధినేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయమని ఆయన కోరిక కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. ఆనాడు రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమతోపాటు అనేకమైనవి పార్లమెంట్‌లో చట్టం చేసి ఇస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా నిలువునా మోసం చేసిందన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయిన వెంటనే తొలి సంతకం ప్రత్యేక హోదా మీద చేస్తామని అనేక మార్లు చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే రాయితీలు వచ్చి అనేక పరిశ్రమలు ఏర్పడుతాయన్నారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, మాజీ మంత్రి కమలమ్మ, నాయకులు నజీర్ అహ్మద్, బండి జకరయ్య, విష్ణుప్రీతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి

జమ్మలమడుగు : గండికోట ప్రాజెక్ట్ ముంపు గ్రామాలలో మొదటి విడత కింద ఉన్న 14 గ్రామాలలో ఇంత వరకు పరిహారం తీసుకోని వారు సరైన ధ్రువీకరణ పత్రాలతో వస్తే పరిహారం అందించడం జరుగుతుందని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.పది లక్షల పరిహారం ఒకేసారి వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. గండికోట ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాల ప్రజల నుంచి ఇప్పటి వరకు 8 వేల మంది నుంచి దరఖాస్తులను తీసుకున్నామని, మొత్తం 9 వేలకు పైగా మంది ముంపు బాధితులు ఉండగా గతంలో 7 వేల మందికి పైగా పరిహారం ఇచ్చామన్నారు. ఇంకా 1117 మంది పరిహారం తీసుకొని బాధితులు ఉన్నారన్నారు. వారు ఎక్కడ ఉన్నా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.

శ్రీనివాసరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు

- పోలీసుల అదుపులో ప్రతాప్‌రెడ్డి, మరో ఐదుగురు నిందితులు
- పక్కాగా రెక్కీ నిర్వహించి చేశారని నిర్ధారణ
- ఎవరెవరి పాత్రపై లోతుగా విచారణ


శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డి గారి శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఆయనను శుక్రవారం ఉదయం కడప నగరంలోని సంధ్యా సర్కిల్ సమీపంలో బురఖాలను ధరించి వచ్చిన ఇద్దరు దారుణంగా వేటకొడవళ్లతో నరికి చంపారు. వారికి దగ్గరనే మరో ఇద్దరు కాపలాగా వుండి, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా చూసుకున్నారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ హత్య వెనుక ఎవరెవరి హస్తం వుంది? ఎవరు అతన్ని అంత దారుణంగా హత్య చేయాల్సి వచ్చింది? అనే కోణంలో కూడా పోలీసు అధికారులు, తమ సిబ్బందితో కలిసి విచారణ చేస్తున్నారు. మరో వైపు ఈ హత్య జరగడానికి ముందు కొన్ని రోజుల నుంచి ప్రధాన నిందితుడు, సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మోపూరు ప్రతాప్‌రెడ్డికి, శ్రీనివాసుల రెడ్డికి మధ్య విభేదాలు తలెత్తాయని విచారణలో భాగంగా తెలుస్తోంది. అంతకు ముందు ఎంతో స్నేహంగా వున్న వీరు ఆర్థిక లావాదేవీలు, స్థల వివాదాల కారణంగానే దూరంగా వుండి, ఒకరినొకరు ఫోన్‌లలో దుర్భాషలాడుకుంటూ సంభాషించుకున్నారని సమాచారం. ఈ హత్యకు ఇంకా ప్రతాప్ రెడ్డితోపాటు మరికొందరి పాత్ర కీలకంగా వుందని భావిస్తున్నారు. మృతుడి భార్య మౌనిక అనుమానితులుగా తమ ఫిర్యాదులో ఇచ్చిన మేరకు ప్రధానంగా మోపూరు ప్రతాప్‌రెడ్డి పేరు పేర్కొన్నారు. అతనితోపాటు టీడీపీ నాయకులైన జమీల్ మొబైల్స్ అధినేత జమీల్, పాలెం సుబ్బారెడ్డి, గుంటి నాగేంద్రతోపాటు, విశ్వనాథరెడ్డి పేర్లను అనుమానితులుగా పేర్కొన్నారు. వీరి పాత్ర ఏమేరకు ఈ హత్య కేసులో వుందో పోలీసులు నిగ్గు తేలుస్తున్నారు. ఇప్పటికే ప్రధాన సూత్రదారి ప్రతాప్‌రెడ్డి, మరొకరు బురఖాలను ధరించి ప్రత్యక్షంగా.. శ్రీనివాసులరెడ్డిని దారుణంగా వేటకొడవళ్లతో, పిడిబాకుతో చంపారని సీసీ టీవీ ఫుటేజీల ద్వారా నిర్ధారించారు. వారికి అండగా మరో ఇద్దరు సంఘటన స్థలం వద్ద వున్నారని తెలుసుకున్నారు. ఇంకా పై ఇద్దరు నిందితులతోపాటు మరో ఆరుగురి పాత్ర వుందని పోలీసులు తమ విచారణలో తేల్చినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రతాప్‌రెడ్డి, మరో ఐదుగురు పోలీసుల అదుపులో వున్నారనీ తెలిసింది. ఇంకా పలువురి పాత్రపై విచారణ చేపట్టడంతోపాటు, మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. వీరిని రహస్య ప్రాంతంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో ఈ హత్యకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.